క్లుప్తంగా

అంకాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరులో వెలసిన అంకాలమ్మతల్లి మూడో వారం తిరునాల పురష్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెద్దసుబ్బయ్య, శంకరయ్య, భాస్కరయ్య, హరిరాధయ్య, అమర్నాథ్, అనిల్‌లు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు.సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా కోలాటం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని కోలాటం తిలకించారు.

ఎంపీ బహిరంగ సభ వాయిదా



పెద్దకుడాలలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాల వారు

లింగాల : లింగాల మండలం పెద్దకుడాల గ్రామంలో ఆదివారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఎన్నికల బహిరంగ సభను నిర్వహించాల్సి ఉంది. అయితే గ్రామంలోని రెండు వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ తలెత్తడంతో బహిరంగ సభను వాయిదా వేస్తున్నట్లు మండల ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డి తెలిపారు. అంతకుముందు మధ్యాహ్నం 2.30గంటల ప్రాంతంలో వైఎస్ అభిషేక్‌రెడ్డి, వైఎస్ అభినవ్‌రెడ్డిలు గ్రామంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించాల్సి ఉంది. వారు గ్రామానికి చేరుకోగానే పీవీ సుబ్బారెడ్డి వర్గీయులు, అనిల్‌కుమార్‌రెడ్డి వర్గీయుల మధ్య ఆధిపత్యపోరులో భాగంగా స్వల్ప ఘర్షణ చెలరేగింది. దీంతో వారు ఇంటింటి ప్రచారాన్ని ఆపేసి తిరిగివెళ్లారు. తిరిగి ప్రచారం నిర్వహించే తేదీలను ప్రకటిస్తామని వారు తెలిపారు.

నేడు కోరగుంటపల్లిలో ఎన్నికల ప్రచారం

సింహాద్రిపురం : మండలంలోని కోరగుంటపల్లిలో నేడు (సోమవారం) వైస్సార్సీపీ ఎన్నికల పరిశీలకులు గండ్లూరి వీరశివారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కావున మండలంలోని వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు



జానపద గీతాలకు నృత్యాలు చేస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : పులివెందుల పరిధిలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. మదనపల్లెకు చెందిన సూర్య డ్యాన్స్ అకాడమి మాస్టర్స్ సూర్య, అమరావతిల శిష్య బృందంచే నిర్వహించిన జానపద, శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం



కార్నియాలను అందజేస్తున్న కుటుంబ సభ్యులు

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురం గ్రామానికి చెందిన రాజుల పెద్దక్క (85) ఆదివారం మరణించింది. దీంతో ఆమె కుమారులు రామ్‌మోహన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కుమార్తె రామాంజనమ్మ, కోడళ్లు లక్ష్మీదేవి, రామాంజనమ్మ, అల్లుడు రామకృష్ణారెడ్డిలు నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహితఅమృతహస్తం సేవాసమితి నేత్రసేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకి సమాచారం ఇచ్చారు.మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నేత్రదానానికి వయసు పరిమితం లేదని, మనిషి మరణించిన సమయంలో అవగాహన ఉండి సరైన సమయంలో స్పందించి 9966509364, 7093204537 నంబర్లకు సమాచారం అందిస్తే కార్నియాలను సేకరించి అంధత్వంతో బాధపడుతున్న వారికి చూపును ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకారం తెలిపిన కుటుంబ సభ్యులకు సేవా సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌కు విశేష స్పందన

భారీగా తరలివచ్చిన ఉద్యోగులు



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి



బందోబస్తు నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐలు



ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరిన ఉద్యోగస్తులు

పులివెందుల రూరల్ : పోస్టల్ బ్యాలెట్‌కు ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. పులివెందుల నియోజకవర్గంలోని పులివెందుల, లింగాల, వేంపల్లె, సింహాద్రిపురం, తొండూరు, చక్రాయపేట మండలాల నుంచి ఉద్యోగస్తులు భారీగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పోస్టల్‌బ్యాలెట్ ఊపందుకుంది. తర్వాత మందకొడిగా సాగింది. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు వేరువేరుగా ఏర్పాటు చేశారు. అహోబిలాపురం ప్రభుత్వ పాఠశాలలో 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అధికారులు, ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. తొలిరోజు పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల్లో ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా 1802 ఓట్లకు గానూ 1650ఓట్లు పోల్ కాగా 152 ఓట్లు పోల్ కాలేదు.

పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు

పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల సందర్భంగా పులివెందుల పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ పాఠశాలలో డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐ శంకర్‌రెడ్డి, ఎస్సై అరుణ్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చిన ఉద్యోగస్తులకు ఎన్నికల అధికారులు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన వైఎస్ అభిషేక్‌రెడ్డి

పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలకు సంబంధించి ఆదివారం అహోబిలాపురం ప్రభుత్వ పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల పోలింగ్ సరళిని లింగాల మండల వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ వెంకటేశులు, ఎమ్మార్వో రమేష్‌బాబు, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీటీపల్లెకు వైఎస్ భారతిరెడ్డి రాక

చక్రాయపేట : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిరెడ్డి సోమవారం మండలంలోని సురభి గ్రామానిక రానున్నారు. బీటీపల్లెలో ఇంటింటా ప్ర చారం నిర్వహించనున్నారని, మండల ఇన్‌చార్జ్ వైఎస్ కొండారెడ్డి తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి ఆమె ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు.

విద్యుత్ సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

పులివెందుల రూరల్ : విద్యుత్ వినియోగదారులకు ఏమైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయాలని డీఈఈ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సౌకర్యార్థం పులివెందుల పట్టణంలో, డివిజన్ పరిధిలో ఇతర గ్రామాల విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులు నమోదు చేసేందుకు అంబకపల్లిరోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్ ఆవరణలో 24గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. అలాగే ముద్దనూరు గాంధీ సర్కిల్‌లోని సబ్‌డివిజన్ ఆఫీస్ అన్న క్యాంటీన్ వద్ద నూతన బస్టాండు ఆవరణంలో ఉన్న సెక్షన్ ఆఫీస్‌లో ఉదయం 8.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు.

సాయుధ బలగాలతో పోలీసు కవాతు



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

వేంపల్లె : జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు వేంపల్లె సీఐ చాంద్‌బాషా ఆధ్వర్యంలో సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆదివారం మండలంలోని సమస్యాత్మక ప్రాంతాలైన అలవలపాడు, రామిరెడ్డిపల్లి, ముతుకూరు, వెలమవారిపల్లె, బక్కన్నగారిపల్లె గ్రామాల్లో, అలాగే వేంపల్లె పట్టణంలోని ప్రధాన వీధుల్లో సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ చాంద్‌బాషా మాట్లాడుతూ భయం లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. గొడవలు, అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఆర్ ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



కరపత్రాలను అందజేసి ఓట్లు అభ్యర్థిస్తున్న యువరాజ్‌రెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : ప్రజల సంక్షేమాభివృద్ధి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని వైఎస్సార్సీపీ నేతలు యువరాజ్‌రెడ్డి, ఎస్‌వి సతీష్‌కుమార్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం స్థానిక వడ్డెరవీధి, దేవళంవీధి, గాండ్లవీధి, ముత్తరాజువీధి, ప్రియాతోట, భరత్‌నగర్, రెడ్డయ్యకాలనీ, గాజులపేట ఆయా ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలు అందజేసి ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సీఎం వైఎస్ జగన్, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలకు తమ అమూల్యమైన ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిగాయత్రి, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెచెంతకు వైద్యసేవలు

57	విలేజ్‌హెల్త్ క్లినిక్‌ల సంఖ్య
8.17	నిర్మాణ వ్యయం రూ.కోట్లు



సింహాద్రిపురం వైఎస్సార్ విలేజ్‌క్లినిక్

పులివెందుల : ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టింది.ఆరోగ్యశ్రీ సేవలకు మెరుగులు దిద్దింది ఆరోగ్యశ్రీ సేవల కింద రెండువేలకుపైగా రుగ్మతలకు చికిత్సలు అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు గ్రామంలోనే వైద్యసేవలు అందుబాటులో ఉండేలా ప్రతి 2,500 జనాభాకు ఒక వైఎస్సార్ విలేజ్‌క్లినిక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో చిన్నచిన్న జబ్బులకు కూడా 10కిలోమీటర్లు దూరంలో ఉండే పీహెచ్‌సీకి వెళ్లాల్సిన అవసరం లేదు. వీటిలో బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన హెల్త్‌ప్రొవైడర్లను నియమిస్తున్నారు. ఈ క్లినిక్‌లో 12 రకాల వైద్య సేవలు అందించడంతోపాటు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. 65 రకాల మందులు, 67రకాల బేసిక్ మెడికల్‌ఎక్విప్‌మెంట్‌అందుబాటులో ఉంటుంది. నాడునేడు కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌విలేజ్‌క్లీనిక్‌లను పక్కా భవనాల నిర్మాణం చేపట్టారు. విలేజ్‌క్లినిక్‌నుంచి టెలీ మెడిసెన్‌సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వచ్చే రోగులకు అక్కడి సిబ్బంది పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేస్తారు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన పరీక్షలు, వైద్యసేవలు సకాలంలో అందేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు

పులివెందుల రూరల్ : ఈ నెల 13న జరిగే ఎన్నికలకు సంబంధించి డ్యూటీలో ఉన్న వారికోసం ఆదివారం పులివెందుల పట్టణంలోని అహోబిలాపురంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారి వెంకటేశులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలక్షన్ రోజు డ్యూటీలో ఉన్న వారికోసం పీఓలు, ఏపీఓ అబ్జర్వర్‌లకోసం పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు 8 రూములు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం ఓటింగ్ ఉంటుందని ఆయన తెలిపారు. ఓటింగ్‌కు సంబంధించి ఇంటి నుంచి బయటికి రానివారి కోసం ఓటింగ్ ద్వారా ఓటు వేయచ్చని, అందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పది రూములో ఎలక్షన్ అధికారులు వారి ఇంటికి వెళ్లి ఓట్లు వేయించుకుంటారన్నారు. అలాగే ఎలక్షన్ డ్యూటీలో పాల్గొనే పోలీసులు ఎమర్జెన్సీ ఆసుపత్రిలో పనిచేసే అధికారులు, బీఎల్‌ఓలు ఓటును వినియోగించుకునేందుకు సోమవారం అహోబిలాపురంలోని ప్రభుత్వ పాఠశాలలో అనిన సదుపాయాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. పోలింగ్ బూతులలో డిక్లరేషన్ పూర్తి చేసి రెండు బ్యాలెట్ పేపర్లు ఉంటాయని ఎమ్మెల్యే అభ్యర్థికి, ఎంపీ అభ్యర్థికి తమ ఓట్లు వేయాలన్నారు.

పల్లె విం‘చిన’ ప్రగతి



నూతనంగా నిర్మించిన వీరపునాయునిపల్లె-కమలాపురం డబుల్ రోడ్డు



యస్.పాలగిరి గ్రామం వద్ద వాగులో నిర్మించిన వంతెన

కమలాపురం నియోజకవర్గం వీరపునాయునిపల్లె మండల వాసుల దశాబ్దాల కళ నెరవేరింది. టీడీపీ హయాంలో ప్రభుత్వ స్థలంలోనే కార్యాలయాల నిర్మాణం చేపట్టాలనే నిర్ణయంతో ఊరికి రెండు కిలో మీటర్ల దూరంలో మండల కార్యాలయ భవనాలను నిర్మించడంతో జనం నానా కష్టాలు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలను మండల కేంద్రం నడిబొడ్డున ఏర్పాటు చేస్తుండడంతో ప్రజల కళ నెరవేరినట్లయింది. దీనికి తోడు పల్లెల్లోనూ కార్యాలయాలు నిర్మించడంతో జనం కష్టాలు తీరాయి.

\- వీరపునాయునిపల్లె

- మండల కేంద్రానికి కార్యాలయాల తరలింపు
- సంగమేశ్వర ఆలయానికి నూతన శోభ
- పల్లె వద్దే మెరుగైన వైద్యం అందేలా క్లీనిక్‌లు

వీరనాయనపల్లి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ చిన్న పని ఉన్నా మండల కేంద్రంలో బస్సు దిగి కాలినడకన వెళ్లాల్సి వచ్చేది. కాలక్రమేణా ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో వెళ్తూ వందల రూపాయలు ఖర్చు పెట్టాల్సిందే. వర్షాకాలం సమయంలో వెళ్లే దారి పూర్తి బురదమయంగా మారి ప్రజలు ఇబ్బంది పడ్డారు. చాలా మంది వృద్ధులు ఎండా కాలంలో తాగేందుకు నీరు లేక స్పృహ కోల్పోయిన సందర్భాలు కోకొల్లలు. మండల కేంద్రానికి ప్రభుత్వ కార్యాలయాలు దూరంగా ఉన్నాయని టీడీపీ ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కార మార్గం దొరకలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారుల దృష్టికి తీసుకెల్లడంతో కార్యాలయాలు మండల కేంద్రంలో నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం పనులు చివరిదశలో ఉన్నాయి. ఎన్నికలు పూర్తి కాగానే రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలు మండల ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

శాశ్వత పరిష్కారం

మండలంలోని యస్.పాలగిరి గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. తేలికపాటి వర్షం కురిసినా.. ఊరు ముందర ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించి గ్రామం నుంచి బయటికి వచ్చేందుకు, వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది.

గ్రామం వెలసినప్పటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. గత ఏడాది ఇద్దరు గొర్రెల కాపరులు వాగులో కొట్టుకుపోయి ముళ్ల పొదల మధ్య పది గంటల పాటు ఊపిరి బిగబట్టుకుని గడిపారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని కల్వర్టు నిర్మించి శాశ్వత పరిష్కార మార్గానికి చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులకు ఊరట లభించింది.



ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు

అందరూ చదవాలన్నదే ప్రభుత్వ సంకల్పం



సర్వరాజుపేట ఆర్‌అండ్ఆర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాల

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్నదే ప్రభుత్వ సంకల్పం. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా పాఠశాలలను అభివృద్ధి చేశారు. కార్పరేట్ పాఠశాలల్లో సౌకర్యాలకు తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనూ అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది. నిరుపేదల పిల్లలు ఉన్నత విద్య సదివించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అమ్మ ఒడి, పీజు రీయంబర్స్‌మెంటు వసతి దీవెన పథకాలను అమలు చేస్తోంది. ప్రతి పిల్లవాడికి ఉన్నత విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

సంగమేశ్వర దేవాలయానికి మహర్దశ



సంగమేశ్వర దేవాలయం వద్ద నిర్మించిన టూరిజం విశ్రాంత గది

వీరపునాయునిపల్లె మండలంలోని అతి పూరాతనమైన సంగమేశ్వర దేవాలయానికి మహర్దశ నెలకొంది. గతంలో ఉన్న ప్రభుత్వాలు ఆలయ అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దివంగత మహానేత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో టూరిజం గెస్ట్ హౌస్ నిర్మించారు. ఆయన మరణానంతరం ఆలయ అభివృద్ధి కుంటుపడింది. అంతే కాకుండా ఆలయానికి వచ్చేందుకు రహదారి సక్రమంగా లేక భక్తులు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక వీరపునాయునిపల్లె నుంచి సంగమేశ్వర ఆలయాల మీదుగా కమలాపురం వెళ్లేందుకు డబుల్ రోడ్డు నిర్మాణం, టీటీడీ సహకారంతో కళ్యాణ మండపం నిర్మించేందుకు చర్యలు చేపట్టడంతో ఆలయానికి నూతన శోభ సంతరించుకుంది.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



వీరపునాయునిపల్లె ప్రభుత్వ ఆసుపత్రి

గ్రామీణ ప్రాంతాల్లోని మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 'నాడు నేడు' కార్యక్రమంలో భాగంగా అత్యాధునిక పరికరాలు ఏర్పాటుచేయడంతో 24 గంటల పాటు వైద్యం అందేలా సిబ్బందిని నియమించారు. అంతే కాకుండా మండలంలో 15 సచివాలయాలు ఉండగా అందులో 14 సచివాలయాలకు అనుసంధానంగా 13 విలేజ్ క్లీనిక్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో విలేజ్ క్లీనిక్‌కు రూ.18 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. దీంతో ప్రభుత్వ అధికారుల సేవలు, వైద్యం అందుబాటులోకి వచ్చింది.